


'ఏమిటే? నిజంగానే?' అంటూ పడుకొన్నదల్లా లేచి కూర్చుంది లక్ష్మి. వింతగా తోటికోడలి ముఖంలోకి చూస్తూ 'ఇప్పుడేం కొంప మునిగిపోయిందని ఆపరేషన్ చేయించుకొన్నారు? ఏ పదిమందిని కన్నారు? అసలు మగపిల్లవాడు లేకుండా చేయించుకోవడానికి మనసెలా వొప్పిందే?' అదేదో హత్యానేరం చేసిన వాణ్ణి చూసినట్లు గౌరి కేసి చూస్తో.

'ఆఁ మగేమిటి, ఆడేమిటి లేద్దత్తా? ఈ ముగ్గురికీ సరిగ్గా పెట్టి, పెంచగలిగితే చాలనుకొన్నాం,' అంది గౌరి నిర్లక్ష్యంగా.

కాని, లక్ష్మమ్మ మాత్రం ఊరుకోలేదు. గౌరి వచ్చిందని తెలిసి చూడటానికి వచ్చిన వాళ్ళందరికి వింతగా చెప్పడం మొదలు పెట్టింది.

అందరూ 'అయ్యో! అదేమిటమ్మా అలా చేసుకొన్నారు?' అని సానుభూతిగా చూసేసరికి గౌరికి గొప్ప చికాకేసింది.

'సెరకపోయి చెప్పేన్రా భగవంతుడా' అనుకొంటూ వాళ్ళను తప్పించుకొందుకు చిన్న తోటికోడలుగారింటికి వెళింది.

పల్లెటూళ్లో ఏ విషయమైనా ఆఖరికి 'వాళ్లింట్లో కరివేపాకు చెట్టు మొలిచిందిట' అన్న విషయం దగ్గర్నుంచి 'అల్లిపాళ్ళ అచ్చమ్మను మొగుడొదిలేశాడు' అనే విషయం వరకు మనోవేగంకంటె ఎక్కువగా పాకిపోతాయి.

ఇక్కడ దొరకని మనశ్శాంతిని వెతుక్కొంటూ చిన్నత్తగారింటికి వెళితే,

గుమ్మంలో అడుగుపెట్టిందో లేదో, కాఫీ కని ఇంటికొచ్చిన చిన్న మామయ్య.

'ఏమే నిజమేనంటే? వాడు ఆపరేషన్ చేయించుకొన్నాడటా?' అని అడిగాడు.

అప్పుడే అది మగవాళ్ళదాకా పోవడం, పోనీ విని ఊరుకోకుండా మామయ్య ఆ విషయాన్ని తననే అడిగెయ్యటంతో గౌరికి కోపం నసాళానికంటింది.

'అవును మామయ్యా! ఏం తప్పా? మేమెంతమందికి పెట్టగలమో చూసుకొని, అంత మందికే జన్మలిచ్చాం. ఈపాటి దాని కెందరూ ఎందుకంత ఆశ్చర్యపోతున్నారో నాకర్థం కావటంలేదు. పెట్టినా పెట్టక పోయినా పది మందిని కనేసి, వాళ్ళఖర్మానికి వాళ్ళేడుస్తుంటే చూస్తూ ఊరుకోవడం మాకు చేత కాదు. అయినా యిలాంటి విషయాల మగవాళ్ళు మగవాళ్ళతో, ఆడవాళ్ళు ఆడవాళ్ళతో అనుకొంటే బాగుంటుంది కానీ...' పూర్తిచెయ్యలేకపోయింది.

'అహహ్హ, ఏదో మగపిల్లవాడు లేకుండా చేసుకొన్నారన్న బాధ కొద్దీ అన్నాను కాని...' సర్దుకొంటూ బైటకెళ్ళిపోయాడు.

చిన్నత్త పిలుస్తున్నా వినిపించుకోకుండా ఇంటికెళ్ళి పడుకొంది చికాకుగా గౌరి.

అసలు జరిగిందేమిటో చెప్పకుండా ఇలా ఎంత చెబితే మాత్రమేం? అది ఒక ఉమ్మడి కుటుంబం. ముగ్గురన్నదమ్ములు, ఇద్దరక్కచెల్లెళ్ళలో, ఆడపిల్లలు పెళ్ళిళ్ళయి అత్తవారిళ్ళలో వున్నారు. మగవాళ్ళలో పెద్దవాడైన ఆనందమూర్తి ఆ పల్లెటూళ్ళోనే మాస్టరుగా చేస్తున్నాడు. రెండవవాడు శేఖరం కోమటి గుమాస్తాగా చేస్తూ, పొలాలన్నీ చూస్తున్నాడు. ఇక ఆఖరివాడు సారథి సిటీలో వుద్యోగం చేస్తూ, భార్యా, పిల్లలతో అక్కడే వున్నాడు. పెద్దవాళ్ళిద్దరికి పై సంబంధాలు చేసినా, సారథికి మాత్రం. అతను మనసు పడ్డ, తన అక్క కుమార్తె గౌరినిచ్చి చేసింది ఆ యింటి ఇల్లాలు జయమ్మ. సారథి పెళ్ళైన ఆరునెలలకే స్వర్గస్థురాలైంది. భర్తను నెతికొంటూ వెళ్ళిపోయిందామె. పెద్దతను ఆనందానికి ముగ్గురు ఆడపిల్లల తరువాత ఇద్దరు మగపిల్లలు. రెండవతను శేఖరానికి ముగ్గురు మగపిల్లలు, ఒక్కతే ఆడపిల్ల. మూడవవాడైన సారథికి

# ఆడపిల్లలు

ముగ్గురూ ఆడపిల్లలే. చిన్నమామయ్యకు కొడుకు పుడితే చూడటానికి వచ్చింది గౌరి. అన్నలు కలసివున్నా, వంటలు మాత్రం వేరే పెట్టుకొన్నారు అన్నదమ్ము లిద్దరూ. గౌరి పెద్దమామయ్యగారింట్లోనే దిగింది. ఆ రోజు మధ్యాహ్నం భోజనాలు పూర్తయ్యాయి. తోటికోడళ్ళిద్దరూ ముందు సావిట్లో కూర్చొనుండగా మొదట లక్ష్మి అడిగింది.

'గౌరీ! చంటిదానికిసంవత్సరన్నరదాటింది కదూ? ఈసారి కొంచెం వెనుక బడ్డట్టున్నావే నీకు?' లక్ష్మి ఇప్పుడు ఐదు నెలల గర్భిణి.

ఆ మాటమీద 'లేదత్తా! ఆపరేషన్ చేయించుకొన్నారాయన.' అంది గౌరి.

అందుకు జరిగిన రాద్ధాంతమంతా.

జరిగినదానిని మననం చేసుకొంటూ ముగతగా పడుకొన్న గౌరి చంటిదాని ఏడుపు వినిపించటంతో లేచి ఇవతలికొచ్చింది. ఏడుస్తున్న చంటిదాన్ని ఎత్తుకొని, తన ప్రవర్తనకు తానే సిగ్గుపడింది. వాళ్ళేదో మూర్ఖంగా అంటే తనంతకన్నా మూర్ఖంగా ప్రవర్తించింది. చీకటి పడడంతో పిల్లలకు అన్నాలు పెడుతున్న పెద్దత్త దగ్గరకెళ్ళి చంటిదాన్ని కూడా అన్నానికి కూర్చో బెట్టింది.

'నేను అన్నం పెడ్తానంటే రాలేదే ఇది'. అంటూ దానికూడా కంచంలో అన్నం పెట్టింది లక్ష్మి.

'నేనేదో బాధగా అన్నదానికి నువ్వింత ఇదౌతావనుకోలేదే' అంది క్షమా స్వరంతో.

'లేదత్తా! నేనే ఏదో శివమెత్తినట్లు ప్రవర్తించాను. అదిగో! వాడు మజ్జిగ కావాలంటున్నాడు చూడు' అని ప్రసంగం మార్చేసింది గౌరి.

కాని, తన మనస్సులోంచి మాత్రం వాళ ప్రవర్తనను త్రోసివెయ్యలేకపోయింది. భోజనంచేసి పక్కపై పడుక్కొన్న గౌరి,

'చిన్న మామయ్యేమనుకొన్నాడో అంత కోపంగా మాట్లాడితే! పొద్దున్నే వెళ్ళాలి.'

అనుకొంటూ ఈ ఆపరేషన్ జరగడానికి గల కారణాలు తల్చుకొంది.

చంటి పిల్లను కడుపులో వుండగా ఏడు నెలలపుడు తనకు గుండె దడ వచ్చింది. అదేదో నీరసాన్ని అనుకొన్నారు గానీ. అదో పెద్ద జబ్బనుకోలేదు. కాని, మరలా రాకే టంతో స్పృహలేని స్థితిలో హాస్పిటల్‌కు తీసికెళ్ళారు. 'ఏట్రియల్ టెకికార్డియా' అని డాక్టరు చెప్పిన మాట విని తెల్లబోయిన భర్తను తానే నోదార్చవలసి వచ్చింది. అసలు తనకు ప్రతిసారీ కాన్పు గండమే. సన్నంగా, ఊదితే పడిపోయేట్టున్నా, పెళ్ళికి ముందు ఎప్పుడూ జ్వరమైనా ఎరగదు తాను. కాని, పెళ్ళయిన ఏడాదిలోనే పెద్ద పాప పుట్టటంతో బలహీనంగా తయారైంది. తరువాత వరుసగా మిగిలిన ఇద్దరూ పుట్టే సరికి తన ఆరోగ్యం కూడ బాగా పాడైంది. డాక్టరు చెప్పిన మాట వినగానే అన్నాడు సారథి.

'ఈసారితో నీమయినా సరే స్టాప్ పెట్టేదాం గౌరీ'' అని.

కాని, తనకే మనసొప్పలేదు. చివరి వరకూ తామూ ఎంతో మనసు పడ్డారు, మగపిల్లాడైతే బాగుండునని. కాని, తమ దురదృష్టమేమో మళ్ళీ ఈ చంటిది పుట్టింది. కాన్పుకని హాస్పిటల్‌కు తీసికొని వెళ్ళేముందు మళ్ళీ గుండె దడ వచ్చేసరికి డాక్టర్లే భయపడ్డారు. భయపడ్డమే కాక, సారథితో చెప్పేశారు కూడ, తల్లో, పిల్లో ఎవరో ఒకరే దక్కుతారని. కాని, తమ అదృష్టంకొద్దీ ఇద్దరూ బ్రతికి బయట పడ్డారు. అప్పుడే ఆ డాక్టరు చెప్పింది,

'ఈసారి ఆపరేషన్ చేయించేసుకొండి. ఇంక ఆమె తట్టుకోలేదు' అని. సారథి కూడ అందుకు ఒప్పుకొన్నాడు.

కాని, తన తల్లికి, తనకు నచ్చలేదు, కారణం తమ యింట్లో (పుట్టింట్లో) గనంతటి లేకపోవటమే! కాని, సారథి ససేమిరా అని పంతంపట్టి చేయించు కొచ్చారు

తెల్లవారితే ఆపరేషననగా తను ముభావంగా కూర్చుంటే, భర్త తనను అనునయించిన తీరు తలచుకొంటే గౌరి పెదవులపై చిన్న నవ్వు మెరిసింది. ఆ రోజు... ఆ రోజు,

తను చంటిదాన్ని పడుక్కోబెట్టి, జోకొడతూ కూర్చుంది. నెమ్మదిగా వచ్చి తన ప్రక్కనే మంచం మీద కూర్చున్నాడాయన.

'ఏం గౌరీ! కోపంగా వుండా నా మీద ?

మాట్లాడవేం ?' అని అడిగారు.

'కోపమెందుకు? ఏ బాధ పడ్డైనా ఒక్క బాబు పుట్టేవరకు వేచివుందామంటే మీ కెందుకో నచ్చటం లేదు' అంది తను.

'గౌరీ! నా బాధంతా నీ గురించే. దేవుడి దయవల్ల మనకింకో బిడ్డ పుంటే పెట్టలేమనే బాధ లేదు కాని, నువ్వే లేని పరిస్థితి వస్తుందంటే...అబ్బ! నేనూహించ లేను. వద్దు గౌరీ! మనకు బాబు లేకపోతే వచ్చే నష్టమేమీ లేదు. వీళ్ళనే మగపిల్లలుగా పెంచుకుందాం. అందులోనూ మన చంటి చూడు. ఎంత మోటుగా మగ వాడిలా వుంటుందో! నాకు...నాకు పిల్లల కంటే నువ్వే ఎక్కువ గౌరీ! నిన్ను రక్షించుకోవటంకోసం ఒక్క మగపిల్లవాణ్ణే కాదు, ఏదైనా వదిలేస్తాను.' అనేసి వెళ్ళిపోయారు.

మరునాడు ఆపరేషన్ చేయించుకొన్నారు. అప్పటినుండి అతని ధోరణే మారిపోయింది. పిల్లల్ని ఇంతకు ముందుకంటె ఎక్కువ ముద్దు చేస్తున్నాడు. ఎంతసేపూ ఆడపిల్లయితే ఎంత గొప్ప, మగపిల్లలు వరగబెట్టేదేమీ లేదని చెప్తూ తన బెంగ పోగొట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు మాట్లాడుతున్నారు. తనకు కూడా ఆపరేషన్ చేయించుకోవటం ఇష్టమే కాని తనకు అన్నదమ్ముల్లేరు. మగబిడ్డయినా లేకుంటే ఎలా? అన్న బాధతో వద్దన్నది. ఆపరేషన్ ముందురోజు ఆయన చెప్పిన మాటలతో అయిష్టమన్నది ఏమైనా ఉంటే పూర్తిగా తుడిచిపెట్టుకొని పోయింది.

అప్పట్నుంచే తను కూడా—

'అంతా ఆడపిల్లలే?' అన్నవాళ్ళనల్లా దుయ్యబట్టేస్తోంది.

చంటిదాని బారసాలకు అందర్నీ రమ్మని ఉత్తరాలు రాశాడాయన. చిన్న ఆడపడుచు తప్ప మిగిలిన వాళ్లందరూ వచ్చారు. ఆపరేషన్ చేయించుకొన్నట్లు అప్పుడే ఎవ్వరికీ చెప్పొద్దన్నారు తన భర్త. దాంతో ఆ విషయం ఎవరికీ తెలియదు.

ఆలోచనల్తో నిద్ర పట్టలేదు.

'అప్పుడే తెల్లవారుజాము అయినట్టుంది కాకులు అరుస్తున్నాయి' అనుకొంటూ బలవంతాన కళ్ళు మూసుకొంది గౌరి.

తెల్లగా తెల్లవారినా లేవని తల్లిని



పెద్ద పిల్ల నును వచ్చి లేపింది. బద్ధకంగా లేచి చూసి,

'ఎంత ఎండెక్కిందో! ఛీ, మొద్దులా నిద్రపోయాను' అనుకొంది గౌరి.

ఆ రోజు చిన్న మామయ్య గారింట్లో భోజనానికి రమ్మన్నట్లు గుర్తు వచ్చి, సరిగ్గా భోజనం టైముకి వెళితే బాగుండదని, గబగబా పిల్లల్ని తయారు చేసి, తనూ స్నానం చేసి తయారై పెద్దత్తతో చెప్పింది వెళ్తున్నానని.

'వెళ్తున్నావా? సాయంత్రం వచ్చెయ్యండి. అది చంటి పిల్లవాడితో చెయ్యలేదేమో! చంటివాడు వస్తానంటున్నాడు తీసికెళ్ళు' అని వాళ్ళ చంటివాడిని అందించింది.

'అలాగే' అందే కాని, గౌరి మనస్సు వాళ్ళలో కొత్తగా వచ్చిన ఏదో కృత్రిమత్వాన్ని గ్రహించింది. అది ఎందుకో ఆమె కప్పుడర్థం కాలేదు.

చిన్న మామయ్య గారింటికి వెళ్ళేసరికి మామయ్య ఇంకా కొట్టుకెళ్ళలేదు. పాలేర్తో ఏదో మాట్లాడుతున్నాడు. గౌరి చాల సిగ్గుపడిపోయింది అతనికేసి చూడ్డానికి. నిన్నటి తన ప్రవర్తనకి ఏమనుకొన్నాడో అనుకొంటూ లోపలి కడుగు పెట్టింది.

'హాఁ గౌరీ! రావే రా! ఏమే ఎక్కడున్నావ్? గౌరి వచ్చింది. చంటివాణ్ణి దాని కిచ్చి నువ్వు వంట చూడు. నేను కొట్టు కెళ్తున్నాను' అనేసి వెళ్ళిపోయాడు.

నిన్నటి తన ప్రవర్తనకు ఏదో చెప్పాలని గౌరి నోరుతెరచేలోగా కనుచూపుమేర దాటిపోయాడు.

రుక్మిణి వచ్చి చంటివాణ్ణి గౌరి చేతి కిచ్చి, చంటి పిల్లను ఎత్తుకొంది. మూడు నెలలైనా నిండనివాణ్ణి మెడల క్రింద చేతుల వేసి జాగ్రత్తగా ఎత్తుకొంటున్న గౌరితో,

'చూశావే గౌరీ! నీ దగ్గర కెలా వచ్చే శాడో? ఇంకెవరెత్తుకొన్నా తెగ ఏడుస్తాడు వెధవ' అంటూ వంటింట్లోకి దారి తీసింది రుక్మిణి.

గౌరి కూడ అక్కడికే వెళ్ళి పీట వాల్చుకొని కూర్చుంది.

'నిన్న పిలుస్తుంటే వెళ్ళి పోయావేం? నీకంత కష్టం కలిగించే మాటలేం అన లేదే ఆయన? ఏదో ఆత్రుత కొద్దీ నిన్న వెంటనే నేను చెప్పేశాను. ఆయన ఉండబట్టలేక అడిగేశాడు. అయినా మీరు చేసిన పని మాత్రం ఏం బాగుంది! మనింట్లో ముగ్గురు ఆడపిల్లల తరువాత మగపిల్లవాడు కలగటం అలవాటే కదా! తొందర పడ్డారు మీరు?' అంది రుక్మిణి.

'నిజమే నత్తా! నిన్న నాకేదో శివమెత్తింది. లేకపోతే, పెద్ద మామయ్య దగ్గరున్న చనువైనా లేదు నాకు చిన్న మామయ్య దగ్గర. తనూ అస లెప్పుడూ మాట్లాడడు. అలాంటిది నిన్న అడిగేసరికి అలా వాగేశాను. అందుకు నేనూ బాధ పడ్డాను. కాని, నా పరిస్థితేమిటో తెలుసా? అక్కడ ఈ ఆపరేషను గురించిన వాగ్బాణాలను తప్పించుకోవచ్చని ఇక్కడికి పారిపోయొచ్చాను. రాగానే మామయ్యా అదే అడిగేసరికి చికాకేసింది. మామయ్యనేమీ అనుకోవద్దని చెప్పు' అంది తల దించుకొని గౌరి.

'సరిలే! దానికేం గాని: వాడు నిద్ర పోయినట్టున్నాడు, ఉయ్యాలలో పడుక్కోబెట్టు' అనేసి 'ఒక్క మగపిల్లవాడుంటే బాగుండిపోను' అంది రుక్మిణి మళ్ళీ.

గౌరికి చిర్రెత్తుకొచ్చింది. తనకు రోగం చేత, ఆపరేషను చేయించుకొన్న సంగతి చెప్పి, వీళ్ళందరి సానుభూతి పొందాలని లేదామెకు. తమిష్టమొచ్చినట్లు తాము చేసుకొంటే వీళ్ళందరూ ఏమిటి మధ్యన? అనుకొంటోంది. దాంతో వుండబట్టలేక,

'ముగ్గురైతేనేమిటి? ఆరైతేనేమిటి? మా పిల్లలకేం? ఆణిముత్యాలు. శుభ్రంగ చదివిస్తాం. మాకున్నది ముగ్గురికీ సమానంగ పెట్టి పెళ్ళిళ్ళు చేస్తాం. పోయిన ఇద్దరం మిగులుతాం. ఇంకా ఓపిక వుంటే, మాకు లేకపోతే మా పిల్లలకుండదా యేమిటి మగపిల్లలు? వాళ్ళను తెచ్చి పెంచుకొంటాం.' అంది గౌరి గర్వంగా.

ఎందుకోగాని, రుక్మిణి ముఖం నల్లబడి పోయింది. అంతలో సంబాళించుకొని హాస్యంగా,

'అదే సంగతి. మళ్ళీ మీ రిద్దరే మిగల్లాలని చేశావా యిలా? కొడుకుంటే కోడలు వస్తుంది. సందడిగా వుంటుంది. అది వని

# ఆడపిల్లలు

రాదా? పోనీ ఆపాటి దానికి ఈ పిల్లలు కూడా దేనికి?' అనేసి చటుక్కున ఊరుకొంది రుక్మిణి తనన్నమాట తనకప్పటి కర్థమై.

అప్పటికే గౌరి ముఖం కోపంతో ఎర్రగా కందిపోయింది.

'అత్తా!' ముఖంలో కోపం, దుఃఖం పోటీ పడుతుండగా,

'అయినా ఆడపిల్లలంటే మీకెందు కింత అలుసు? మాకు మగపిల్లలు లేకపోతే మీ కొచ్చే నష్టమేమిటి? మగపిల్లలు కలగకుండా ఆపరేషన్ చేయించుకోవలసి వచ్చినందుకు మేమేపాటయినా బాధ పడుతుంటే మీ మాటలతో అది కాస్తా ఎగిరిపోయింది. వెధవ మగపిల్లల కోసం వున్న నా పాపలను పోగొట్టుకొనేంత మూర్ఖురాలిని కాను. ఇంటికి పిలిచి మంచి సత్కారం చేశావు. వస్తా' అనేసి లేచింది గౌరి.

రుక్మిణి చటుక్కున గౌరిచెయ్యి పట్టుకొని.

'గౌరీ! ఏదో అనబోయి ఏదో అనేశాను. ఏమనుకోకు. వెళ్ళిపోకు. అయినా నీకు మా పిల్లలు మాత్రం పిల్లలు కారా ఏమిటి? నువ్వు తీసికెళ్ళాలిగాని, ఈ చంటివాణ్ణిచ్చెయ్యనూ?' అంది.

ఆమె చెపుతున్న దేమిటో మొదటర్థం కాలేదు గౌరికి. అర్థమైన తర్వాత,

'ఎందుకులే, మా పిల్లలే మాకు చాలు. ఎవరి పిల్లలు వాళ్ళదగ్గ రుంటేనే బాగుంటుంది.'

నిర్లిప్తంగా అనేసి పిల్లవాణ్ణి ఉయ్యాలలో పడుకోబెట్టడానికి వెళ్ళింది. అక్కడ కుర్చీలో కూర్చొనున్న సారథిని చూసి ఆశ్చర్యంగా,

'మీరెప్పుడొచ్చారు? వచ్చి తిన్నగా పలకరించకుండా ఇక్కడ కూర్చున్నారేమిటి?' అంది.

మాటలు వినబడి రుక్మిణి కొంగుకు చెయ్యి తుడుచుకొంటూ ఇవతలి కొచ్చింది. అక్కడ మరిదిని చూసి,

'నువ్వెప్పుడొచ్చావోయ్?' అనడిగింది.

'మీరిద్దరూ దెబ్బలాడుకొంటున్నప్పుడు. అయినా గౌరీ! నీ కింత కోపం వచ్చేసిందెందుకు?' నవ్వుతూ అడిగాడు సారథి.

'ఏంలేదు లెండి. మీరు స్నానం చేశారా? చేస్తారా? వంటైపోయినట్లుంది, భోజనాలు చేసేద్దాం. అయినా పదిగంటల వేళప్పుడు మీకే బస్సు దొరికింది?' గౌరి భర్తనడిగింది.

రుక్మిణి వంటింట్లోకి వెళ్ళిపోవటం చూసి సారథి,

'ఆఫీస్ జీప్‌లో వచ్చాను కాని, అపరకాళికావతారం ఎత్తేశావే?' అన్నాడు నవ్వుతూ.

తను కూడా నవ్వుతూ,

'ఇంతకూ మీరెక్కడ్నుంచి విన్నారో నాకేం తెల్సు? మంచి టైముకి వచ్చారు కాని. ఇక నేనిక్కడుండలేను. మధ్యాహ్నం బస్సుకెళ్ళిపోదాం. ఎవరైనా రోడ్డుమీదకు పంపండి టిక్కెట్లు చెప్పడానికి' అనేసి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

ఇంతలో పిల్లలు ముగ్గురూ తండ్రి వచ్చాడని తెలిసి పరిగెత్తుకొచ్చారు. చంటిదాన్నెత్తుకొని, ఇద్దర్ని నడిపించుకొంటూ వంటింటి గుమ్మంలోకొచ్చి—

'ఇద్దరూ పోటు పోటుగా వున్నారు. వంటకాల్లో ఖారా లెక్కువేశెయ్యకండి. నేనూ, మా చిన్నన్న తినలేం.' అన్నాడు హాస్యంగా సారథి.



అగ్ఫా—గేవర్ట్ సంస్థకి చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా నియమితుడయిన శ్రీ ఆర్. ఎల్. నారాయణ్. ఇంతకిముందు ఈయన ఇదే సంస్థకి మార్కెటింగ్ మేనేజరుగా ఉండేవారు.

'మీరు తినలేనంతగా వేసెయ్యటం లేదు; భయపడిపోకయ్యా.' అన్నది రుక్మిణి.

రుక్మిణి పెద్దబ్బాయిని పంపించింది వాళ్ళ నాన్నను తీసుకొనిరమ్మని. పావుగంటలో అందరూ భోజనాలకు కూర్చున్నారు. మగవాళ్ళిద్దరికీ, పిల్లలకు పెట్టేశారు. రుక్మిణి వడ్డిస్తుంటే, పిల్లలకు కలుపుతూ, గౌరికూడ అక్కడే కూర్చుంది. శేఖరం తమ్ముడితో పొలాల గురించి మాట్లాడి చివరకు,

'ఒరే సారథీ! ఈ చంటివాణ్ని తీసుకొని పొండిరా. మళ్ళీ అడగములే. మీకు మగపిల్లవాడున్నట్లుంటుంది. వాడింకా చిన్నవాడు. మీతో కలసిపోతాడు.' అన్నాడు.

సారథికి మొదట అన్న చెప్పిన్నదేమిటో అర్థమే కాలేదు. అర్థమైన తర్వాత పకపకా నవ్వేసి,

'ఏంటన్నయ్యా! హాస్యమాడుతున్నది నాతోనా? వదినతోనా?' అన్నాడు.

శేఖరం తెల్లబోయి చూశాడు.

'హాస్యం కాదురా! నిజమే. నువ్వు ఆపరేషన్ చేయించుకొన్నావట కదా!'

'అవును. అయితే దానికీ, దీనికీ సంబంధమేమిటో నాకర్థం కావట్లేదు.' అన్నాడు సారథి అమాయకంగా.

'అదేంట్రా? నీకు ముగ్గురూ ఆడపిల్లలే కదా! మరి మగపిల్లవాడి సరదా తీరేదెలా? వాణ్ని తీసుకొనివెళ్ళి, నీ కొడుకుగానే పెంచుకో! ఆడపిల్లలు పరాయింటికి వెళ్తారు. మగపిల్లవాడైతే ఇంటిపేరు నిలబెడ్తాడు.' అన్నాడు శేఖరం. సారథికి నీకలదాకా వచ్చింది కోపం, కాని బలవంతంగా అణచుకొని,

'అన్నయ్యా! అంటే నువ్వు నీ కొడుకును దత్తత చేసుకోమంటున్నావ్? అన్యాపదేశంగా ఆస్తి బైటకు పోదని చెప్తున్నావు కదూ! పరాయింటికి వెళ్ళినా నా పిల్లలు కాకపోరుగా? నాకు మగపిల్లవాడవసరం అనుకొంటే కలిగేదాకా వేచివుండును. కాని, నాకక్కర్లేదు. నా పిల్లలు నాకుండగా పెంచుకోవలసిన అవసరం నాకు లేదు. అసలు పిల్లలు లేనివాళ్ళకి పెంపకాలూ అవీని! మాకేం ముత్యాల్లా ముగ్గురున్నారు. వాళ్ళను చూసుకొంటూ బ్రతగ్గలం.' అనేసి,

శేఖరంవైపు తిరిగి,

‘పెరుగేసెయ్యి వదినా!’ అన్నాడు మరి శేఖరానికి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా.

నేతిగిన్నె పట్టుకొని, బొమ్మలా నిలబడిపోయిన రుక్మిణి, తేరుకొని పెరుగు వడ్డించగా గబగబా తినేసి లేచి.

‘గౌరీ! త్వరగా కానీ, ఆఫీసు జీప్ ఉంది. అందులో వెళ్లిపోదాం. వస్తా నయ్యా! పెద్దన్నయ్యను కూడా కలిసి వస్తాను. గౌరీ! నేనక్కడ వుంటాను త్వరగా రా!’ అనేసి వెళ్లిపోయాడు సారధి.

తరువాత శేఖరం కూడ చెయ్యి కడుక్కొని వీధిలోకి వెళ్లిపోయాడు. రుక్మిణి, గౌరి మౌనంగా భోజనాలు ముగించారు. గౌరి వెళ్తున్నానని చెప్తే రుక్మిణి బొట్టు పెట్టి,

‘ఈ జరిగినవన్నీ మర్చిపోండి. నువ్వూ, అతనూకూడ. మామూలుగా మీ అమ్మమ్మ గారి పల్లెకానికి రా!’ అని చెప్పింది.

గౌరి ‘అలాగే’ అంటూ పెద్దమామయ్య గారింటికి బయలుదేరింది.

ఇంటికెళ్లేసరికి లక్ష్మి ఎక్కడా కనపడలేదు. ఇవతల వున్న బట్టలవి తీసి, మడతలు పెట్టి సూట్‌కేసులో పెట్టింది. దండెమీద ఆరేసిన చీర తెచ్చుకొందామని వెళ్లబోతూ ఉంటే, మెట్ల గదిలోంచి లక్ష్మి మాటలు వినిపించి ఆగింది.

‘నయమే! అయితే మేమడుగుదాం అనుకున్నాం చిన్నత్తయ్యగారూ! అడిగితే మాకూ అన్ని చివాట్లు లభించి ఉండును’ అంటోంది.

ఆ చిన్నత్తయ్యగారు భోజనాలక్కైములో శేఖరం ఇంట్లో ఉంది.

ఆవిడ అప్పుడే మోసుకొచ్చేసిందన్న మాట న్యూస్. ఇక పిళ్ళ చేత చెడ్డవడ్డం అన్నమాట’ అనుకొంటూ దండెమీది చీర తెచ్చి, మడతపెట్టి సూట్‌కేస్‌లో పెట్టింది.

అప్పుడు పిలిచింది పెద్దత్తను.

‘అత్తా! మీ మరిది జీప్‌లో వచ్చారు. వెళ్ళిపోతున్నాం’ అని చెప్పింది గౌరి.

‘మంచిది. ఇక్కడకూ వచ్చాడతను. మీ వాళ్ళ పిన్ని వస్తున్నారట వైజాగ్. అందుకని నిన్ను తీసికెళ్ళడానికి వచ్చానన్నాడు’ అంది లక్ష్మి.

‘ఓహో! అందుకా ఈయన వస్తే? ఇంకా ఏమీ చెప్పలేదు. పోన్లే, నేనూ వెళ్ళిపోదామనే అనుకొంటున్నాను’ అని గౌరి పాలేరును పిల్చింది సూట్‌కేస్ జీప్‌లో పెట్టమని.

లక్ష్మి బొట్టు పెట్టి సాగనంపింది. గౌరికి అప్పుడు స్పష్టంగా అందరి మనస్తత్వాలూ అర్థమైనై. లక్ష్మిలో ప్రొద్దున్నటి కృత్రిమత్వానికి బదులు ఒక విధమైన నిర్లిప్తత కనిపెట్టిందామె. అందరికీ చెప్పి ప్రయాణమైనారు భార్యాభర్తలు పిల్లలతో. ఇంతకు ముందు చాల సార్లు వచ్చింది కాని, ఈసారి కలిగినలాంటి అనుభవం ఇంతకు ముందెప్పుడూ కలగలేదు గౌరికి. ఎవరింటికి వెళ్ళితే వారే ఎంతో ఆప్యాయంగా మాట్లాడేవారు. ఈ సారి తాము ఆ ఆప్యాయతను పోగొట్టుకొన్నామేమో అనుకొంది గౌరి. ఇంతకూ కారణం ‘ఆపరేషన్’ అనుకొంటే నవ్వొచ్చిందామెకు.

‘ఏమిటీ? నీలో నువ్వే నవ్వేసుకొంటున్నావ్? నాక్కూడా చెపితే నేను కూడా నవ్వుతానుగా!’ అంటున్న భర్తవైపు తిరిగి

‘ఏమండీ! వీళ్ళందరికీ మనకు మగపిల్లవాడు కలగనందుకు బాధా? లేకపోతే ఆస్తి పైకి పోతుందని బాధా?’ అనడిగింది గౌరి.

సారధి బాధగా నవ్వి,

‘ఇంకా తెలియలేదా గౌరీ! నువ్వన్నదాంట్లో రెండోదానికే వీళ్ళ బాధంతాను. కాని, ఆణిముత్యాల్లాంటి పిల్లలను పట్టుకొని, ఆడపిల్లలైన కారణంగా, ఎందుకంత నిరసన చేస్తారో నాకర్థం కావటం లేదు.’ అన్నాడు ఆప్యాయంగా పిల్లలకేసి చూస్తూ.

గౌరి ఒక విధమైన గర్వంతో, తృప్తితో భర్తనూ, పిల్లలనూ మార్చి చూస్తూ కూర్చుంది సారధి మధురంగా నవ్వుతూ,

‘ఈ ఆడపిల్లలే సామ్రాజ్యాలేలేస్తారో? లేకపోతే వాళ్ళమ్మలాగా ఏ మగవాళ్ల బతుకులకు రాణులై, వాళ్ల కంటివెలుగులౌతారో?’ అన్నాడు.

గౌరి...ముగ్గురాడపిల్లల తల్లి గౌరి, కొత్త పెళ్లికూతురిలా సిగ్గుపడింది. ●


